క్లుప్తంగా

రేపటినుంచి గ్రామ దేవత పండగలు



నీలమణి అమ్మవారి ఆలయం

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని సుభలయలో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నీలమణి అమ్మవారి 8వ వార్షికోత్సవం, గ్రామ దేవత పెద్ద పండగలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం అమ్మవారి గ్రామ ప్రతిష్ఠ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతీరోజు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు సాయంత్రం వినోద క్యాక్రమాలు ఉంటాయన్నారు. ఈ పండగలు ప్రతీ ఐదేళ్లకు ఓసారి చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: ఆధ్యాత్మిక భావాలతో గ్రామాల్లో ఐకమత్యం చోటు చేసుకుంటుందని మాజీ ఎంపీపీ శిమ్మ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిమ్మ సాంబశివరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో గల కోదండ రామ ఆలయ వార్షికోత్సవ వేడుకలను మూడు రోజులపాటు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం, హోమాలు, పూజలు చేసి ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యుల సహకారంతో పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని సాంబశివరావు తెలిపారు.

అన్నసమారాధన



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర పెద్దదేవాంగుల వీధిలో శుక్రవారం శ్రీరామనవమి ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడురోజులపాటు జరిగిన ఉత్సవాలలో మెదటిరోజు సీతారాముల కల్యాణం, రెండోరోజు శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి, సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. మూడోరోజైన శుక్రవారం నారాయణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు



నరసన్నపేటకు చేరుకున్న ఈవీఎంలు, వీవీ ప్యాట్లు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నరసన్నపేటలో పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా పోలింగ్‌కు అవసరైన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు శుక్రవారం స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓపెన్ చేశారు. పోలీసు బందోబస్తు మధ్య భద్రపరిచామని ఆర్వో రామ్మోహన్‌రావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి



ప్రేరణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సరుబుజ్జిలి: విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటే మంచి భవిష్యత్ సాధించగలరని సమగ్ర శిక్ష మోనటరింగ్ ఏఎంఓ గుంట లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవం నిర్వహించారు. జిల్లాలోని 30 మండలాల నుంచి బాల, బాలికలను ఒక్కొక్కరి వంతున 60 మంది విద్యార్థులను ఎంపిక చేసిన వారికి వ్యాసరచన, డ్రాయింగ్, పద్యరచన పోటీలు నిర్వహించారు. ఇంటర్వ్యూ ద్వారా ఇద్దరిని ఎంపిక చేశారు. వీరికి గుజరాత్‌లోని వాగ్నర్‌లో రెసిడెన్సియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. నవోదయ ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య, ఎంఈఓలు కె. శ్రీనివాసరావు, డి.బాలరాజు, జలుమూరు ఎంఈఓ ప్రసాదరావు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: పెద్ద జొన్నవలసలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



జలుమూరు: కృష్ణాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: బందపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అభివృద్ధి చేశాం.. ఆదరించండి



నరసన్నపేట: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కోడళ్లు శ్రావణి, గ్రీష్మ



పాతపట్నం: పాతపట్నంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు



మెళియాపుట్టి: జంతూరు లో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి స్వాగతం పలుకుతున్న గిరిజన ప్రజలు



బూర్జ: లచ్చయ్యపేటలో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



జలుమూరు: కృష్ణాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సారవకోట: రామకృష్ణాపురంలో కరపత్రాలు అందజేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య



ఆమదాలవలస రూరల్: చిన్న జొన్నవలసలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కొత్తూరు: తుమ్మికిమోను గూడలో ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ, నాయకులు



సారవకోట: రామకృష్ణాపురంలో మేం సిద్ధం అంటున్న ధర్మాన కృష్ణచైతన్య, గ్రామస్తులు, పార్టీ నాయకులు

- సంక్షేమ రాజ్యానికి పట్టం కట్టండి
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి

ప్రచార పర్వం

పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందించారని స్పీకర్, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కంట్లాం, లచ్చయ్యపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమదాలవలస మండలంలోని పెద్ద జొన్నవలస, చిన్న జొన్నవలస గ్రామాల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. జలుమూరు మండలంలోని వెంకటాపురం, రామచంద్రాపురం, కృష్ణాపురం, సుబ్రహ్మణ్యపురం, యడ్లవానిపేట తదితర గ్రామాల్లో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. మెళియాపుట్టి మండలంలోని వెంకటాపురం సచివాలయం పరిధిలోని జంతూరు, ఎగువ బందపల్లి, బందపల్లి, వెంకటాపురం గ్రామాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నరసన్నపేట మేజరు పంచాయతీలోని దేశవానిపేట, వజ్రంపేట, నక్కవీధి, గుజ్జలవీధుల్లో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కోడళ్లు ధర్మాన శ్రావణి, గ్రీష్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. సారవకోట మండలంలోని రామకృష్ణాపురం, చరణ్‌దాసుపురం, జరాళి, మదనాపురం, చంద్రయ్యపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ తరఫున పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ధర్మాన రామలింగం నాయుడు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బలాజీ నగర్ 1, 2, 3 వీధుల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తరఫున వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. కొత్తూరు మండలంలోని తుమ్మికిమోను గూడలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు ఓం శ్రీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. **- సాక్షి నెట్‌వర్క్**

అభ్యర్థుల వ్యయాలపై దృష్టి పెట్టాలి

నరసన్నపేట: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి వ్యయాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పార్లమెంట్ వ్యయపరిశీలకులు శరవణ కుమార్ అన్నారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో వ్యయ పరిశీలన సిబ్బంది పనితీరును శుక్రవారం పరిశీలించారు. అభ్యర్థులకు సరైన సూచనలు చేయాలని, నిబంధనలు తెలియజేసి సక్రమంగా రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల వ్యయాలపై నిఘా వేయాలని సూచించారు. స్థానిక ఆర్వో రామోహ్మన్‌రావుకు పలు సూచనలు చేశారు.



వివరాలను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు శరవణకుమార్

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా

బూర్జ: మడలంలోని ఓ.వి పేట, గుత్తావల్లి గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఆయా గ్రామ సచివాలయం కార్యదర్శులకు అందజేశారు.

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ త్రివిక్రమ రావుకు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో విశాఖ సూరిబాబు, గోడబ లక్ష్మణరావు, బోగాపు రపు నరేష్, అరసాడ మన్మథరావు ఉన్నారు.



కొత్తూరు: రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న కర్లెమ్మ వలంటీర్లు

‘తనిఖీలను ముమ్మరం చేయాలి’

హిరమండలం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తనిఖీలను ముమ్మరం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రత్యేక ఎన్నికల అధికారి రాఘవేంద్ర మీనా అన్నారు. శుక్రవారం హిరమండలం న్యూబ్యారేజీ సెంటర్ సుభలయ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. వాహన తనిఖీలను స్వయంగా నిర్వహించారు. మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడి చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టులలోని సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది నిరంతరం ప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరారు. ఓటర్లను ప్రలోభాలను గురిచేసే వస్తువులు, డంప్‌లను గుర్తించి స్క్వాడ్‌లతో కలసి దాడులను జరపాలని చెప్పారు. ఆయనతో పాటు ఉప తహసీల్దార్ రవి, హెచ్‌సీ రామారావు, వెంకటరమణ ప్రసాద్ పోలీసు సిబ్బంది ఉన్నారు.



చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎన్నికల ప్రత్యేక అధికారి రాఘువేంద్ర మీనా

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని ఫల్గుణ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా.. భక్తులు హారుతులిచ్చారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గంట ముందే హాజరుకావాలి

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట మోడల్ స్కూల్లో ఈ నెల 21న నిర్వహించనున్న ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు గంట ముందు హాజరుకావాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నప్పటికీ.. 9 గంటలకే హాజరుకావాలన్నారు. హాల్ టికెట్ వెరిఫికేషన్, ఓఎంఆర్ షీట్ నింపే విధానంలో విద్యార్థులు పొరపాట్లు చేయకుండా గంట ముందు వారికి చెప్పడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్‌తోపాటు ఆధార్ లేదా ఐడీ కార్డు తీసుకుని పరీక్షకు హాజరుకావాలన్నారు.

22న స్పీకర్ తమ్మినేని సీతారాం నామినేషన్

ఆమదాలవలస: ఈ నెల 22న ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్పీకర్ తమ్మినేని సీతారాం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు శుక్రవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11:30 మధ్య సమయంలో ఆమదాలవలస ఆర్వో కార్యాలయంలో నామినేషన్ వేస్తారన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని తమ్మినేని సీతారాం, ఆయన తనయుడు చిరంజీవినాగ్ పిలుపునిచ్చారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, మున్సిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, తమ్మినేని సీతారాం అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

22న ఎమ్మెల్యే రెడ్డి శాంతి నామినేషన్

ఎల్.ఎన్.పేట: ఈ నెల 22వ తేదీన పాతపట్నం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి నామినేషన్ వేస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పాతపట్నంలో కొలువైన నీలమణి దుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలి

ఎల్.ఎన్.పేట: ఈ నెల 22వ తేదీన పాతపట్నం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతి నామినేషన్ వేస్తున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరావు, లుకలాపు సుదీర్, కింతలి చిరంజీవి, కెల్ల గణపతి, శివ్వాల సన్ముఖరావు, టి శోభన్ బాబు, బలగ గోవిందరావు, కొల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరావాలి

కొత్తూరు: ఈ నెల 22న పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, పార్టీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు కోరారు.

ఊరూరా ప్రచారానికి ఏర్పాట్లు



ప్రచారానికి సిద్ధం చేసిన ఆటోలు

నరసన్నపేట: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో దూసుకుపోతుంది. ఇప్పటికే ప్రచారంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొంటున్నారు. తాజాగా గ్రామాల్లో ప్రచారం చేయడానికి ఆటోలను సిద్ధం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ పాటలను సిద్ధం చేశారు. వీటిని ప్రజలకు వివరించేందుకు 8 ఆటోలు సిద్ధం చేశారు. ఒక్కో మండలానికి రెండు ఆటో చొప్పున కేటాయించారు. వీటిని శుక్రవారం నుంచి ప్రచారంలో వినియోగిస్తున్నారు.